రసాయన ఎరువుల మోతాదు తగ్గించాలి

● ఆత్మ పీడీ అన్నపూర్ణ

మద్దిపాడు: రసాయన ఎరువుల మోతాదు తగ్గించి జీవన ఎరువులు వాడాలని ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం పీడీ అన్నపూర్ణ సూచించారు. మండలంలోని నందిపాడు, పెదకొత్తపల్లి గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులు సాగు చేసే పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ మండల అధికారి కె.రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ పాల్గొని ప్రసంగించారు. వరి, శనగ, మినుము, పొగాకు పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. నందిపాడులో రైతులతో ఆమె మాట్లాడుతూ జీవన ఎరువుల వాడకం వలన భూమి సారవంతమవడంతో పాటు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. వరి సాగు చేస్తున్న ఏడుగురు రైతులకు పీఎస్‌బీ (అధికంగా ఉండే భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువు), అజోస్పైరిల్లంను జిల్లా వనరుల కేంద్రం ఆత్మా ఎపథకం 2023–24 ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. రైతు పొలంలో ప్రయోగాత్మకంగా చేసి చూపారు. ఈ రెండు జీవన ఎరువులు 500 మిల్లీ గ్రాముల చొప్పున 200 కేజీల వర్మీకంపోస్టుతో కలిపి రైతు పొలంలో చల్లించారు. జీవన ఎరువుల వాడకం పెంచుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయ అధికారులు ఏ శైలజారాణి, వీవీ శేషమ్మ, వెలుగు సీసీ ప్రేమానంద్, ఏఈఓ శేషయ్య, వీఏఏలు పాల్గొన్నారు.



నందిపాడులో యాజమాన్య పద్ధతుల ప్రతిని రైతుకు అందిస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ, ఏఓ రమేష్

వినాయకుని లడ్డూ రూ.75 వేలు

చీమకుర్తి: చీమకుర్తి ఎస్‌ఎస్‌పీ కాలనీలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం చేతిలో ఉంచిన లడ్డూకు బుధవారం వేలంపాట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు బాపతు వెంకటేశ్వరరెడ్డి రూ.75 వేలకు పాడుకున్నారు. చిన్న లడ్డూ అదే కుటుంబానికి చెందిన బాపతు నాగేంద్రరెడ్డి రూ.63 వేలకు పాడుకున్నారు. అనంతరం జరిగిన ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న వారిని అభినందించారు.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథుడు...

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని బుధవారం తొమ్మిదోరోజు నిమజ్జనానికి తరలించారు. ముందుగా పూజలు నిర్వహించి స్వామివారి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గాంధీనగర్ యూత్‌ఫోర్స్ వారు రూ.35 వేలకు పాడుకున్నారు. అనంతరం గణపయ్యను ఘనంగా ఊరేగించి కొత్తపట్నం సముద్ర తీరానికి నిమజ్జనానికి తరలించారు.


చీమకుర్తిలో లడ్డూ ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

రేపు ఎంపీ మాగుంట ఒంగోలు రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 29న ఒంగోలు చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు ప్రకాశం భవనంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగే జిల్లా సలహా కమిటీ, జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు 6 గంటల నుంచి తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

ఇంటింటికీ నీటి కుళాయిలకు భూమి పూజ

● జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.45.5 లక్షలు మంజూరు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెంలో ఇంటింట నీటి కుళాయిలకు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, గ్రామస్తులు బుధవారం టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. పొక్లెయిన్‌తో గుంతలు తీసి పైపులైన్ వేసే ప్రక్రియను కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కె.పల్లెపాలెం ప్రజలకు జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ట్యాప్‌లో నీరివ్వాలనే ఉద్దేశంతో రూ.45.5 లక్షలు మంజూరు చేయించామన్నారు. 450 గృహాలకు ట్యాప్‌లు, 5.2 కిలోమీటర్ల పైపులైన్లు వేయడం జరుగుతోందన్నారు. లబ్ధిదారుడికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ట్యాప్‌లు బిగిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా ట్యాప్‌లు ఇవ్వడం తన రాజకీయ జీవిత చరిత్రలో ఇదే మొదటిసారని ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, మూడు జిల్లాల మత్స్యకార యూనియన్ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు లంకే మురళి, కాపు పోతురాజు, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, పెద్దసింగ్ వెంకట్రావు, ఫిషరీష్ అధికారి కృష్ణ, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, సర్పంచ్ ఆనందరావు, ఎంపీడీవో సుజాత

సంక్షిప్తంగా

కొండా బాపూజీకి నివాళులు

చీమకుర్తి: పద్మశాలీయుల జాతీయ నాయకుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని చేనేత సొసైటీ కార్యాలయం వద్ద పద్మశాలీయుల సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పద్మశాలీయుల కోసం బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, చేనేత సొసైటీ నాయకులు అవ్వారు ఆదినారాయణ, సోమా యానాదిశెట్టి, డీ పుల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చీమకుర్తి విద్యార్థిని


చాందినితో పీడీ స్వరూపావాణి

చీమకుర్తి: చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పీ చాందిని హేమర్త్రో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ డీ స్వరూపావాణి తెలిపారు. బుధవారం సింగరాయకొండలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సంతనూతలపాడు నియోజకవర్గం తరఫున చాందిని పాల్గొంది. మండల స్థాయిలో చీమకుర్తిలో, నియోజకవర్గ స్థాయిలో సంతనూతలపాడులో నిర్వహించిన పోటీల్లో చాందిని మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి మెడల్ సాధించి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించింది. చాందినితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ స్వరూపావాణిని హైస్కూలు హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు సబర్బన్: నగరంలోని నిర్మల్‌నగర్ పార్క్ ఏరియా, సుందర్‌నగర్ ఏరియాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒంగోలు ఆపరేషన్స్ డీఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దెబ్బతిన్న స్తంభాలను మార్చేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

వివాహిత అదృశ్యం

ఒంగోలు టౌన్: అత్తింటి వేధింపులు భరించలేక ఒక వివాహిత ఇంటి నుంచి వెళ్లి పోయింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండల మద్దినగర్ బడ్డెర కాలనీకి చెందిన అచ్చి జ్యోతిని ఒంగోలులోని గంటాపాలెంకు చెందిన కుంచాల ప్రసాద్‌కు ఇచ్చి పది నెలల క్రితం వివాహం చేశారు. అత్తారింట్లో అడుగు పెట్టిన కోడలికి వేధింపులు మొదలయ్యాయి. దీంతో కూతురు, అల్లుడిని తీసుకొని వెళ్లి కొంతకాలం తన వద్ద ఉంచుకొని సోమవారం అత్తారింటికి ఒంగోలుకు పంపించారు. అయినా కలహాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని జ్యోతి ఫోన్‌చేసి తన తల్లికి చెప్పింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నుంచి జ్యోతి కనిపించడం లేదని అల్లుడు ప్రసాద్ ఫోన్ చేసి చెప్పాడు. దాంతో ఆందోళనకు గురైన జ్యోతి తల్లి సుబ్బులక్ష్మి వెంటనే ఒంగోలుకు చేరుకొని కూతురి కోసం వెదికినా ప్రయోజనం లేకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా ప్రోగ్రాంలో భాగంగా బుధవారం క్లాప్ మిత్రలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు చేస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మనమంతా ఆరోగ్యంగా ఉంటున్నామంటే పారిశుధ్య కార్మికులు కారణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారు విధులు నిర్వహించడం మరువలేమని కొనియాడారు. అనంతరం క్లాప్‌మిత్రలు కత్తి బాబూరావు, పొన్నం శంకరమ్మను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, మూడు జిల్లాల మత్స్యకార యూనియన్ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు లంకే మురళి, గ్రామ కాపు పోతురాజు, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, కృష్ణ, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.


క్లాప్‌మిత్రలను సన్మానిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, సర్పంచ్ ఆనందరావు

గడప వద్దకే పోస్టల్ సేవలు

చీమకుర్తి: జనంలోకి మనం–గడప వద్దకే పోస్టల్ సేవలు అనే నినాదంతో పోస్టల్ శాఖ ప్రచారం చేపట్టింది. బుధవారం చీమకుర్తిలో పోస్టల్‌శాఖ జిల్లా ఉన్నతాధికారులు, చీమకుర్తి పోస్టల్ శాఖ సిబ్బంది కలిసి స్థానిక పోస్టల్ శాఖకు చెందిన ఖాతాదారులకు అందించే సేవలు, పథకాలను వివరించారు. పోస్టల్‌శాఖలోని పథకాలపై జిల్లా డిప్యూటీ సూపరింటెండెంట్ బీవీఎస్ సురేష్ స్థానికులకు అవగాహన కల్పించారు. తొలుత పోస్టల్ పథకాలపై బ్యానర్ చేతబట్టి చీమకుర్తి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ జవహర్, చలువాది బదరీనారాయణ, చలువాది రమేష్, చీమకుర్తి పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు, సిబ్బంది

స్వచ్ఛతా హీ సేవపై శ్రద్ధ చూపాలి

ఒంగోలు సబర్బన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. నగరంలోని 15వ డివిజన్ పరిధిలో గల సంతపేటతో పాటు వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. సంతపేటలోని సాయిబాబా గుడి పరిసరాల్లోని నివాస ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, ఎంఈ, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన...

నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో జరుగుతున్న షాదీఖానా నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ పరిశీలించారు. మొదటి అంతస్తు నిర్మాణానికి ఒంగోలు నగరపాలక సంస్థ రూ.1.80 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

షాపుల యజమానులు సకాలంలో అద్దెలు చెల్లించాలి...

నగరపాలక సంస్థకు చెందిన షాపులు లీజుకు తీసుకున్న వారు సకాలంలో అద్దెలు చెల్లించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లతో పాటు కొత్త కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఆయన పర్యటించారు. అద్దె బకాయిలున్న లీజుదారులతో స్వయంగా మాట్లాడారు. వెంటనే కనీసం 50 శాతం అద్దె బకాయిలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకురాలు పురిణి ప్రభావతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బావ వేధింపులపై ఫిర్యాదు

ఒంగోలు టౌన్: అక్క భర్త తనను పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లికి చెందిన గద్దం బాలకాశయ్య దంపతులకు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దమ్మాయిని మార్కాపురం మండలం బోడపాడు గ్రామానికి చెందిన రాగోల బాలస్వామికిచ్చి వివాహం చేశారు. మరదలు పార్వతిపై కన్నేసిన బాలస్వామి ఆమెను వివాహం చేసుకుంటానని, అక్కాచెల్లెళ్లను బాగా చూసుకుంటానని వేధించడం ప్రారంభించాడు. దాంతో వారు అక్కడి నుంచి ఒంగోలు వచ్చి గద్దలగుంటలో నివాసం ఉంటున్నారు. పార్వతి కర్నూలు రోడ్డులోని ఒక మొబైల్ దుకాణంలో పనిచేస్తోంది. అయినప్పటికీ బాలస్వామి వేధింపులు మానలేదు. తరచూ ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒంగోలు వచ్చి గద్దలగుంటలోని పార్వతి నివాసానికి వెళ్లి గొడవ పెట్టుకున్నాడు. ఇంటి నుంచి బయటకు జుట్టుపట్టుకుని లాగి బూతులు తిట్టాడు. పెళ్లి చేసుకోకుంటే చంపేస్తానని బెదిరించాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు పార్వతి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.